భార్య

"శార్వాణి"

(గత సంచిక తరువాయి)

కమల నవ్వుతూ అచ్చటనుంచిలేచి, వంటింట్లోకి వెళ్ళి ఖాళీడబ్బాను తీసుకొనివచ్చింది.

"నిన్నిచ్చట దయదలచివుంచినందుకు, నీ యిష్ట మొచ్చినట్లు వాగుతున్నావు. అతను వచ్చిన తర్వాత, నీకు నీవే నా కాళ్లమీదవచ్చి, క్షమించమని బ్రతిమాలుకుంటావు"

"నా తప్పులుంటే యిప్పుడే క్షమించమని కోరు కుంటాను. తప్పులను ఆరోపించి, బ్రతిమాలించు కోవడం మీ కిష్టమైతే క్షమించమని అడగడానికి ఎవరి మనస్సు అంగీకరించదు."

"నీతో వాదించడానికిరాలేదు. మాటలతో నన్ను విసిగించదలచుకుంటే, అనవసరంగా తర్వాత బాధపడతావు."

"ఎవరు విసిగిస్తున్నది ప్రత్యక్షంగా నిరూపించ బడుతూనేవుంది. అంత తేలిగ్గా తోటి స్త్రీ హృద యాన్ని కష్టపెట్టడంవల్ల సర్వనాశనాన్ని కోరుకుంటు న్నట్లు కన్పిస్తుంది."

"నీ మాటలు నాకు అర్థంకావడంలేదనుకుంటు న్నావు. భర్తను సుఖపెట్టలేని ఆడది, ఈ విధం గానే నీతులు చెప్తుంది. ఇంతవరకు నాశనమయిం దెవరో ?"

"సుఖపెట్టకల్గుతున్నామని మాయోపాయాలు పన్ని, అనుబంధమైన మనస్సులను విడదీసి, చల్లని సంసారాలను చిచ్చుపెట్టడం నేర్చుకున్న వాళ్ళకు, నైతికనియమం, నీతినిజం ఏమి తెలుస్తుంది. ఇప్పటి కైనా మించిపోయినదిలేదు. భగవంతుడు చూపు తున్న మంచిమార్గంవేపు ప్రయాణంచేస్తే, ధర్మం నిన్ను తప్పకుండా రక్షిస్తుంది."

"నోరుమ్మూస్తావా ? లేదా ? ఎక్కువ ప్రేలావంటే అతడు వచ్చిన తర్వాత మెడపట్టుకొని బయటకు గెంటిస్తాను."

"ఎంతకైనా సాహసిస్తావు. వారిలో హృదయ దౌర్భల్యం వున్నంతవరకు దుర్మార్గాన్ని చేయడానికి వెనుకంజ వేయవు. నిన్ను స్త్రీగా పుట్టించినందుకు, సమాజంలో స్త్రీగౌరవాన్ని మంటగలుపుతున్నావు" కమల అచ్చటనుంచి వెళ్ళిపోయింది మోహిని చీరలన్నీ తీసుకొని, గదిలోనికివచ్చి చిందర వంద రగా విసరగొట్టింది. వెంకట్రావు యింటికివచ్చేసరికి, తలవిరబోసుకొని, ముఖం చిట్లించుకొని కూర్చుంది.

"ఈ ఇంట్లో అదైనా వుండాలి. నేనైనా వుండాలి. ముందు ఏ సంగతి తేల్చిచెప్పు." వెంక ట్రావు నుద్దేశించి అడిగింది.

"అసలు సంగతి చెప్పకుండ తొక్కత్రొక్కిన త్రాచుపాములాగ బుసలుకొడితే ఎట్లా !" మంచం మీద చతికిలపడ్డాడు.

"నీ పెళ్ళాం, ఆ దెయ్యం తన నోటికివచ్చినట్లు వాగుతుంది. బట్టలు వుతికిపెట్టమంటే, నీకేమైనా దాసీనా, అంతగా అవసరముంటే నిన్ను తీసుకొని వచ్చినవారితో వుతికించుకోమని అంటోంది." అబ ద్ధాలు అల్లి, వున్నవిలేనివి ఏకరవుపెట్టి, అతనిని కన్ విన్స్ చేయడానికి ప్రయత్నంచేసింది.

"ఆ రోజు నేనుచెప్తే విన్నావా ? నేను పంపి స్తుంటే నీ కోరి యింట్లో పెట్టుకున్నావు."

"మనిషి చూడ్డానికి మెత్తగాకన్పిస్తే మంచిదను కున్నాను. ఇట్లాగ నెత్తినెక్కుతుందన్న సంగతి తెలుసుంటే ఆ రోజే బయటకు గెంటించేదాన్ని."

వెంకట్రావు అచ్చటనుంచిలేచి, వసారాలోనికి వచ్చాడు. కమల చీరచిరుగులను కుడుతోంది. వెంకట్రావు రావడంచూచి, లేచినిలబడింది.

"ఆమెను నీ యిష్టమొచ్చినట్లు అనడానికి అధికార మెవరిచ్చారు?" ఆమెకు కొంచెం దగ్గరగా వచ్చి ఉద్వేగంతో అన్నాడు.

"నేనేమి అనలేదు." మెల్లగా అంది.

"అబద్ధాలుకూడా నేర్చుకున్నావన్నమాట. నీవు ఏమిఅనలేదూ.''చంపమీద గట్టిగా కొట్టేసరికి, ఆమె తల వొంచుకొని నించుంది. అశ్రుకలుషితమైన ఆ ఎర్రని నేత్రాలను చూడలేక, వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

"మోహినీ! ఈ సారికి ఆమెను క్షమించు. ఆమె వెళ్ళిపోతే నీవు వంటచేసుకోవాలి. వంటింట్లో నీవుంటే, పొగకు నీ ముఖం కందిపోతుంది. చేతులు బండబారిపోతాయి. ఇహనుంచి జాగ్రత్తగా వుంటుందిలే!"

కమల చిన్నసంచిని చేతిలోపెట్టుకొని, గుమ్మం దగ్గరకువచ్చి నిలబడింది.

"ఎక్కడికి బయలుదేరావు?"

"మీరు హృదయపూర్వకంగా కోరుకుంటున్న చోటుకి."

"సరిగా సమాధానంచెప్పు! ఎక్కడకు వెళ్లేది."

"మీ సుఖంకోసం, భగవంతుడ్ని ప్రార్థించడానికి అందరూ ఎచ్చటకు వెళ్తున్నారో అచ్చటికి."

"నన్ను విసిగించకు అర్థమయేటట్లు చెప్పు"

"మానవులలో మీకున్న మర్యాదను నిర్మూలించడం యిష్టంలేక."

"నీ వంటున్నది బోధపడటంలేదు"

"మంచి మనస్సుతో చూడగల్గితే అర్థమవుతుంది. అనుబంధమైన సంబంధం ఎంత నలిగిపోతుందో బోధపడుతుంది"

"నిన్నీ ఇంట్లో సరిగా చూడటంలేదంటావు."

"ఆ మాట మీరే అంటున్నారు. మీరు నన్ను సరిగా చూడటంలేదని నా నాలుక అంటే, మీరు దాన్ని ముక్కముక్కలుగా ఖండిస్తారు. మీరు అంటున్న నిజం జరగక పోయినా నేను ఆ విషయంలో మీ గౌరవాన్ని నిలబెట్టుటకు 'అబద్ధమాడవలసివుంది."

"నీకు మతిపోయింది. అర్థంలేని ప్రేలాపన."

"మనశ్శాంతిలేని జీవితంలో మీరు వూహించిన విషయం మీమనస్సు మంచిగా మారకపోతే తప్పకుండా జరుగుతుంది. క్షమించండి. నా అర్థంలేని ప్రేలాపనతో మిమ్మల్ని విసిగించకుండానే నన్ను మీరు కోరుకుంటున్న చోటుకి పంపించండి."

"నీవు ఎక్కడకు వెళ్లడానికి వీల్లేదు."

"మీరంటున్నది నిజం. నేను ఎక్కడికి వెళ్ళకూడదు, ఈ ఇంట్లోనేవుండాలి. మీపాదాల మీద పడి, సేవచేస్తూవుండాలి. కాని మీ గౌరవాన్ని మరొకరు మంట గలుపుతుంటే సహించను."

"అంటే మోహిని నిన్ను ఏమి అనకూడదంటావు?"

"ఆమెకు నాకు ఈ ప్రపంచంలో ఎటువంటి సంబంధంలేదు. నాస్థలాన్ని ఆమె ఒకవేళ బలవంతంగా ఆక్రమించుకున్నా అది కేవలం క్షణికం. ఆమె నన్నుదూషించినా, పరుషంగా పల్కినా నా సౌశీల్యాన్ని కించత్తుగూడా కళంకిత పరచలేదు. ఒకప్పుడు ఆమె మీ మనస్సును మార్చినప్పుడు ఆమె మీదగ్గర ఒక్కక్షణం వుండలేదు."

"మీరు మీరు ఏగంగలో దిగుతారో దిగండి కాని, నన్ను మాత్రం మీ మధ్య యిరికించవద్దు." మోహిని మధ్యలో గల్గచేసుకుంది.

"బాగా ఆలోచించు. ఒకసారి వెళ్ళిన తర్వాత మళ్లి నీకీ ఇంట్లో చోటులేదు. అప్పుడు కాళ్ల మీద పడి ఏడ్చినా ప్రయోజనంవుండదు."

"ఇప్పుడున్న కన్నీరుకు సమాధానంలేదు. మీ సుఖాలకు అడ్డుగా నిలబడటం నాకిష్టంలేదు."

"అయితే ఒక్క క్షణం ఈ ఇంట్లో వుండవొద్దు. వెంటనే ఇచ్చటనుంచి వెళ్ళిపో!

"మీ సుఖంకోసం వెళ్తున్నాను." అతనికి కడసారి నమస్కారంచేసి బయలుదేరింది. వీధి గుమ్మం దాటి వెళ్ళిన తర్వాత, వెనక్కి తిరిగి చూచింది. పొర్లివస్తున్న దుఃఖాన్ని లోపల దిగమ్రింగి ముందుకు నడిచింది. మళ్లా వెనక్కి తిరిగి చూచింది. తలుపులు బంధించబడ్డాయి.

సంజె చీకటి అలుముకుంటోంది. ఆ చీకటిలో ఎచ్చటకు వెళ్లాలి? దారి కన్పించడంలేదు. అంతా అగమ్యగోచరంగావుంది. రిక్షాకట్టించుకొని కనకదుర్గగుడికి బయలుదేరింది. రిక్షావాడికి డబ్బులిచ్చి, కొబ్బరికాయ, పసుపు కుంకుమ పువ్వులు తీసుకొని పైకి బయలుదేరింది. ఒక్కొక్క మెట్టుదాటుతూ, జరగబోయే ఉపద్రవాలను తలచుకుంటూ గుడిదగ్గరకు చేరుకుంది. ఆలోచనలన్నీ మరచిపోయి, భారమంతా కనకదుర్గతల్లిమీద మోపి సాష్టాంగదండప్రణామం చేసింది కుంకుమ నుసటను పెట్టుకొని, ప్రసాదం తీసుకొని, గుడిలోంచి బయటకువచ్చింది. మంటపంమీద కూర్చొని, దూరంగా అందకుండా వున్న చందమామవైపు చూస్తోంది. ఆమెకేమి అంతు చిక్కలేదు. లేచినిలబడింది. కాస్త ప్రసాదం తిని, పంపుదగ్గరకు వెళ్లి మంచినీళ్లు కడుపునిండా త్రాగి ఆకలిని చంపుకుంది. పాలకొల్లు వెళ్లే బళ్లు ఏమి లేవు. తెల్లవారుఝామున ఒకబండివుంది. పాలకొల్లు ఏ మొహం పెట్టుకొని వెళ్లాలి? తల్లిదండ్రులకేమని చెప్తుంది? భర్త పెడుతున్న యిక్కట్లను చెప్పకుండావుంటే, భర్తను అగౌరవపరచడానికిచ్చటకు తయారయ్యావంటే, మళ్లా తిరిగి బ్రతకగలవా? నిజం చెప్పేస్తే, చేతకాకవచ్చేనని అమ్మ అంటే, నామనస్సెంత చివుక్కుమంటుంది? పాలకొల్లు వెళ్ళను. అయితే ఇంకెక్కడకు వెళ్లాలి! దిక్కులేని అనాధ, భర్తచే అగౌరవింపబడిన భార్య ఎక్కడకు వెళ్తుంది? సమాధానం ఎవరుచెప్తారు.? ఎవరు చెప్పరు? ఎవరకి అవసరంలేదు. ఆడది నాశనం అయిపోతుంటే, ఎవరు పట్టించుకోరు. పైగా ఆమెను నాశనం చేయడానికి ప్రయత్నిస్తారు గాని.

గుడికి తాళాలువేసి పూజారులు వెళ్ళిపోతున్నారు. గుడిలో గంటలు విన్పించడంలేదు. కమల మల్లిఖార్జునస్వామి గుడిదగ్గర మెట్ల మీదుగా క్రిందకు దిగివచ్చింది. ఇందాకవచ్చిన రిక్షావాడు కాచుకొని కూర్చున్నాడు.

"అమ్మ బండికావాలా!" రిక్షాను ఆమెదగ్గరకు తీసుకొనివచ్చాడు. ఆమె బండిలో మాట్లాడకుండా ఎక్కికూర్చుంది. రిక్షా, బస్సుస్టాండుదాటి, గవర్నరుపేట సెంటరు దగ్గరకువచ్చింది.

"ఎక్కడకు తీసుకొని వెళ్తున్నావు." ఆమె లోపల్నుంచి అడిగింది

"మీరిందాక ఎక్కిన యింటిదగ్గరకు" ఆమె ఉలిక్కిపడింది. రిక్షా సూర్యారావుపేటకు దారి తీస్తోంది. విజయటాకీసు దగ్గరకు వచ్చేసింది. మలుపు తిప్పాడు. కుడిచేతివైపుకి తిరిగాడు. పోస్టాఫీసు మొదటిసంధు తిరిగి, వెళ్ళుతున్నాడు. ఆమె శరీరం సిగ్గుతో భయంతో కంపించుకొనిపోతుంది. రిక్షాను వెనక్కి తిప్పమని అడగలేకపోతుంది.

"ఈ ఇంటిదగ్గర ఆపుచేయి." రిక్షాదిగింది. ఇల్లు తాళంవేసివుంది. రిక్షావాడికి డబ్బులిచ్చి, అరుగు మీదనవచ్చి కూర్చుంది.

"ఒంటరిగా చీకటిలో కూర్చున్నావు. ఎవరమ్మా నీవు" పక్కింటావిడ లాంతరు తీసుకొని బయటకువచ్చింది. కమల తల పైకిఎత్తి చూచింది.

"నీవా? మీ ఆయనతో యింతకుముందు వెళ్లింది నీవు కదూ! అయితే ఆ అమ్మాయి ఎవరు?" లాంతరువత్తి పెద్దదిచేసి, గట్టిగా ఆవులిస్తూ అంది. కమల కళ్ళను పమిటిచెంగుతో వొత్తుకుంటూ, ముఖాన్ని ఆమెకు కన్పించకుండా చేసింది.

"అర్థమయింది. ఈ మగవాళ్ళను నమ్మకూడదు. కట్టుకున్న యిల్లాలను యింత ఉసురుపెడుతున్నప్పుడు, తగిన ప్రాయచిత్తం కాకుండా మానదు. ఎంతసేపని బయట నిలబడతావు వాళ్లు సినిమాకు వెళ్ళివుంటారు. మా ఇంట్లోకి రా !"

కమల ఆమె మాటలు విన్పించుకోలేదు. కదలకుండా అచ్చటే కూర్చుంది.

"ఎవరికర్మకు ఎవరు బాధ్యులు ?" కాస్సేపటి వరకుచూచి ఆమె లోపలికి వెళ్ళిపోయి, తలుపులు వేసేసుకుంది. కమలకు ఎక్కడలేని దుఃఖం వచ్చింది. వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ చీకటిలో ఆమె కన్నీరు కన్పించనీయకుండా చేస్తోంది. ఆమె దుఃఖాన్ని కీచురాళ్లధ్వని మింగేస్తోంది.

పదిగంటలు దాటేసరికి, వాళ్ళిద్దరూ తిరిగి యింటికి వచ్చారు. అరుగుమీద కమల కన్పించింది. వెంకట్రావు తాళంతీసి, మోహిని లోపలకు వచ్చిన వెంటనే ధబేల్‌మని గడియవేశాడు. కమల తలుపులకు తలబాదుకుంది. గడియతీయలేదు. కొంచెం సేపటికి కమల గుమ్మందగ్గర సొమ్మసిల్లిపడిపోయింది. అర్థరాత్రి ఒకసారిలేచి తలుపులుతీసిచూశాడు. కమల ముఖంనిండా నెత్తురు. తలంతా చేగిపోయివుంది. వెంట్రుకలు నెత్తురుతో చర్మానికి అంటిపెట్టుకునివున్నాయి. ఆమె ముఖంవంక చూశాడు. అతని వెనుక ఎవరో కొరడాతో కొట్టినట్లు ఫీలయ్యాడు. ఆమెను లేవదీసి లోపలకు తీసుకొని వచ్చాడు. నూతిలో నీళ్లుతోడి, ముఖమంతాకడిగి, చేతిలో నీళ్లుపోసుకొని వొసటమీద గట్టిగా జల్లాడు. ఆమె మెల్లగా కళ్లుతెరచి చూచింది. ఎదురుగుండా భర్త కన్పించేసరికి, అతని కాళ్ళను చుట్టేసుకొని ఏడ్చింది.

"నన్ను క్షమించి నన్నిచ్చటే వుండనివ్వండి." తలపైకెత్తి, మరియొకవైపుకి మొహంపెట్టి చూస్తున్న భర్తను బ్రతిమాలుకుంది. అంతలో మోహిని గదిలో నుంచి మేల్కొని అచ్చటకువచ్చి అతన్ని లోపలకు తీసుకొని వెళ్ళిపోయింది. కమల భర్త కన్పించేవరకు ఆశగాచూస్తూ, అచ్చటే ఒరిగిపోయింది. తెల్లవారిన తర్వాత వాకిలితుడవడం మొదలుకొని ఇంటి పనులన్నీ తనే చేసుకుంటుంది. వెంకట్రావు ఎనిమిదయినా లేవలేదు. కమల గదిలోనికి రాబోతే, మోహిని రానీయలేదు. వెంకట్రావుకి తీవ్రంగా జ్వరంవచ్చింది, వళ్లంతా కాలిపోతోంది. అతడు మూల్గుతున్నాడు. మోహిని తనకు కానట్లు, ఏదో పుస్తకం ముఖానికి అడ్డుగా పెట్టుకొని కూర్చుంది.

"మోహినీ ! నిన్నే ! డాక్టర్ని పిలువు. జ్వరం పేలిపోతుంటే నీకు తెలియడంలేదా ?"

"ఈ ఊళ్లో నాకెవరు డాక్టర్లు తెలియరు. మామూలు జ్వరం, రెండు రోజుల్లో తగ్గిపోతుంది." నిర్లక్ష్యంగా మాట్లాడింది.

"పోనీ కాస్త కాఫీఅన్నా తెచ్చిపెట్టు. ఆకలి వేస్తుంది"

"కాస్త జ్వరంవస్తే చాలు ప్రాణాలు కొరుక్కుతింటావు. కాస్త లేచివెళ్ళి త్రాగకూడదూ."

"నీవు లేవకపోతే పోయావుగాని, కమల్ని ఒకసారి యిటుపిలు."

"దాన్ని పిలవడానికి నాకేమి అవసరం. అంతగా అవసరముంటే నీవే పిలుచుకో !"

ఈసారి వెంకట్రావుకి వళ్ళంతా కంపించుకొనిపోయింది. కాని ఏమి అనలేకపోయాడు. అభిమానాన్ని చంపుకుని చవటలాగ చల్లగా వూరుకున్నాడు.

రెండు మూడు రోజులు దాటిపోయాయి. అతని జ్వరం తగ్గలేదు. మందులేదు, మాకులేదు. తనుసేవ చేయక, కమలనుకూడ గదిలోనికి రానివ్వకుండ చేసేసింది.

మరో నాల్గురోజులు దొర్లిపోయాయి. జ్వరం తీవ్రరూపం దాల్చింది. టెంపరేచర్ 105^{0} పైగా వుంది. వెంకట్రావు పూర్తిగా నీరసించిపోయాడు.

"మోహినీ ! నన్ను బ్రతకనివ్వదలచుకోలేదా ?

ఆ మందు గ్లాసులోపోసి యివ్వు." బ్రతిమాలు కున్నాడు. జాలిగా ప్రాధేయపడ్డాడు.

"నేనేమి మీ దాసీదాన్ని కాదు." విసుగ్గా సమాధానం చెప్పేసరికి, నిప్పుమీద నూనె జల్లినట్లు యింది అతనికి.

"అవును. నీవు నా దాసీదానవు కాదు. మహారాణివి. డబ్బున్నంతకాలం నీవు నాకు దాసీదానవు. నేను లేవలేని స్థితిలో వుంటే నీవు మహారాణివి."

"మీతో మాటలు పడటానికి నేనిచ్చటకు రాలేదు."

"నా ప్రాణాలు తీయడానికి వచ్చావు. పండులాంటి సంసారాన్ని నట్టేట్లో కలపడానికి వచ్చావు. అమాయకురాలు, అబల, అనాథ అయిన ఒక స్త్రీ మాంగల్యాన్ని మంటకలపడానికి వచ్చావు. పవిత్రురాలైన ధర్మసీల, న్యాయమూర్తి, కరుణామయి ఒక స్త్రీ చేతులోని గాజులను పగులకొట్టి, నుదిటి కుంకుమను చెరపి, హృదయంమీద కదులుతున్న మంగళసూత్రాన్ని తెంచడానికి వచ్చావు."

మోహిని ఆగ్రహంతో లేచి, అతని చంపమీద ఒక్కటి చరిసేసరికి, కమల పరిగెత్తుకొని అచ్చటకు వచ్చింది. మోహిని జుట్టుపట్టుకొని, రెండు దవడల మీద దభాదభా బాదింది. ఆమెకు వళ్లు తెలియ లేదు.

"ఇంతటితో నిన్ను వదలిపెడుతున్నాను. ఇంతవరకు నా భర్తను ఎంత అగౌరపరచినా సహించాను. నన్ను అవమానిస్తున్నా, నీకు సేవచేయడానికికూడ అంగీకరించి మళ్ళా యిచ్చటకు వచ్చాను. ఇహ సహించలేను. నా భర్తమీద నీవు చేయిచేసుకోడానికి అధికారం ఎవరు యిచ్చారు. నీకు హృదయముందా? నీ దసలు స్త్రీ జన్మేనా! జబ్బుతో లేవలేనిస్థితిలో వారుంటే, హృదయంమీద దెబ్బ కొడతావా? ఇంకా చూస్తావేం! వెళ్లు! ఆ దేవుడ్ని ప్రార్థించు. నిన్ను క్షమించమని నా భర్త కోరుకుంటారు."

మోహిని తన బిచాణా తీసుకొని బయలుదేరబోయింది.

"ఇటుచూడు. నా జీవితాన్ని నాశనంచేయదలచుకొని యిచ్చటకు వచ్చావు. నా భర్త ప్రాణాలనుకూడ తీసుకోడానికి ఎంతమాత్రం వెనుదీయలేదు. ఇహనుంచైనా బుద్ధితెచ్చుకొని, ధర్మాన్ని చూడు. ఎవరి సంసారాల్లో దూరకుండా, మంచిగా బ్రతుకు."

కమల మాటలు మోహిని విన్పించుకోలేదు. మళ్లా వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోబోయింది. కమల వీధిగుమ్మందగ్గరకువచ్చి, మోహినిని పిల్చింది.

"ఆవేశంతో ఏమో అనేశాను. క్షమించు మోహినీ. నా భర్త నీ వలనే మంచివారయ్యారు. నీ దుర్మార్గం వారి వంటిలో బాగా పనిచేసింది. వార్ని నాకప్పగించి వెళ్తున్నందుకు సంతోషిస్తున్నాను."

వీధితలుపులు వేసి, లోపలకు వచ్చింది.

"కమలా! నన్ను క్షమించు." వెంకట్రావు రెండు చేతులతో ముఖం కప్పుకొని, చంటిపిల్లవాడిలాగ యేడ్వడం మొదలుపెట్టాడు.

"అందర్నీ క్షమించేది ఆ భగవంతుడు. మీరేమి అధైర్యపడకండి. జ్వరం తగ్గిపోతుంది" కమల మంచంమీద కూర్చుని, అతని తలను తన వొడిలో పెట్టుకొని, వ్రేళ్ళతో తలను నిమురుతూ సముదాయించింది.

వెంకట్రావుకా జ్వరం డబుల్ టైఫాయిడ్ లోనికి దించినా, అహర్నిశాలు చేస్తున్న కమల శుశ్రూష వల్ల బ్రతకగల్గాడు. ఇప్పుడు వెంకట్రావుని మంచివారుగా కమల చూడగల్గుతుంది.

తన భార్య మామూలుభార్య కాదని, ఎంత దుర్మార్గుడ్నైనా సన్మార్గునిగా చేస్తుందని, ఎంత జబ్బుచేసినా చావురాకుండా కాపాడుతుందని, పూర్వపు వెంకట్రావులాంటివాళ్లు ఎవరైనా జీవితంలో తటస్థించితే, వాళ్లకు పాఠం నేర్పుకుంటాడు వెంకట్రావు.

"ఇదంతా తన భార్య సుఖంకోసమే!" అని.